
**అతని ప్రేమ ఫలించలేదు. ఆమె ప్రేమను పొందలేదు. దారి తప్పిన వాళ్ళూ, దారి లేనివాళ్ళూ కలిస్తే కొత్తదారి కాదా?**

ఆకాశంలో మినుకుమినుకుమంటున్న నక్షత్రాలను ఓ గుప్పెడు కోసుకుందా మనిపించింది. డాబామీద వెన్నెల వెండిలా మెరుస్తున్నది. ఎక్కడినుంచో వచ్చే దిక్కుమాలిన పాటను వూరు పంచుకుంటున్నది. పేరులేని పక్షి ఒకటి నా కళ్ళ ముందునుండి రెక్కలు చప్పుడు చేసుకుంటూ పరుగెత్తింది.

ప్రక్కింటి ఆమె తమ డాబామీదకు వచ్చి శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నది. కుప్పపోసిన నిశ్శబ్దం ఆమెలో వుందనిపించింది. నాకామె కొత్త. నేనుండే డాబా కొత్త. ఆ వూరి జనం, ఆ వూరూ, ఆ రోడ్లు అన్నీ నాకు కొత్త. ఆమెను నాలుగు రోజులనుండీ డాబామీద చూస్తున్నాను నేను.



# ఆమెతో నేను

రెంటాల హనుమత్ప్రసాద్

* * *

రాజారావు కొడుతున్నాడు ఆమెను. జుట్టుపట్టుకుని బరబర గుంజుతున్నాడు ఆమె అతని కాళ్ళు పట్టుకుంది. కళ్ళు ఎర్రగా చేసుకుని తూలుతూ మరీ కొడుతున్నాడు. ఆ అందాలపోగును చిందరవందర చేస్తున్నాడు. అతని క్రూరత్వం ఆమె పట్ల విజృంభిస్తున్నది "కొట్టకండి" ఏడుస్తూ అంటున్నది. బూతులుకూడా రాజారావుకు వచ్చు అని నాకు తెలుస్తున్నది.

"రాజారావ్" పళ్ళు పటపట కొరుకుతున్నాను.

"ఏవే, దొంగముండా. డాబామీద ఏంటి నువు చేసేది. ఆ ప్రక్కింటి వెధవ డాబా మీద చేరితే వాడితో రంకు సాగించాలనుకుంటున్నావా?"

"ఒరే రాస్కెల్ లేనిపోనిపాపం అంటకట్టకురా. వచ్చే జన్మలో కుక్కయి పుడతావ్' జుట్టు పీక్కున్నాను.

చటుక్కున లేచి కిటికీ మూశాను.

ఇప్పుడు వాళ్ళిద్దరూ నాకు కనబడటం లేదు.

* * *

"తెగబలిసి కొట్టుకుంటున్నావ్" అరుస్తున్నాడు రాజారావ్. పదిహేడేళ్ళ ఓ బక్క వెధవను. ఆబక్క వెధవ రాజారావ్ పొలంలో కూలీ.

నాకు నవ్వు వచ్చింది వాడి ఆకారం చూసి. అవును పాపం ఎంతతిని ఎండతాగి బలుస్తున్నాడాయె మరి.

నా కళ్ళకు రాజారావ్ పంపరపనస పండులా, ఆ బక్క వెధవేమో ఎండిపోయిన బత్తాయి తొనలా కనిపిస్తున్నారు.

చిన్నగా నిట్టూర్చాను వాళ్ళిదరిని చూసి.

కళ్ళు మూసుకుంటే సంధ్య గుర్తుకు వచ్చింది. వెంటనే లిల్లీ పూల అందం మొదుగు పూల అందం గుర్తుకు వచ్చింది. ఆమె నా ప్రేమ కపోతం.

సంధ్యా నేను చెట్టా పట్టాలేసుకుని ఎన్నో వెలుగు చీకట్ల సంగమంలో నడిచేం. వెన్నెల భూమీద్రద శయనించాం. గువ్వలా ఒకరి గుండెలో ఒకరు ఒదిగిపోయాం. పచ్చిక నేలలను పరుపులుగా చేసుకుని పొగడ పూల మీద పవళించాం.

ఎన్నో దినాలు అలా మాకు తెలియకుండానే తినేశాం.

ఓర్చలేని సంధ్య తండ్రి నన్నూ, సంధ్యనూ విడదీశాడు. బలవంతంగా సంధ్యను వాళ్ళ బావకిచ్చి పెండి జరిపేడు. అసమర్థుడు అంటే నా వుద్దేశంలో

పిరికివాడు ప్రేమించడానికి అనర్హుడు. అందుకు నేనే ఓ వుదాహరణ.

కొన్నిమెతని గుండెలతో స్నేహమయింది ఈ మధ్య. అది నేనుంటున్న ఇంటిముందున్న ఓ రెండు గులాబీ మొక్కలు. వాటి పూలూ. ఇంటికి ఒక ప్రక్కగా వున్న పొగడచెట్టు మీది గూటిలోని గిజిగాళ్ళూ. ఎదురింటి వాళ్ళ ఐదేళ్ళ ఓ అమ్మడు. బోసినవ్వులు నవ్వే అమ్మడి తమ్ముడు. వీళ్ళు.

నేనుండే ఇంటికీ రాజారావ్ ఇంటికీ మధ్య గోడ అడ్డులేదు. కొద్దిఖాళీ తప్పితే. అందుకే ఆమె ఏ దిశలో వున్నా నాకు కనబడుతూనే వుంటుంది.

వంట గదిలో నుంచి బయటకు వచ్చిన ఆమెవంక చూశాను సానుభూతిగా. ఆమె కళ్ళు ఎర్రగా తయారై వుబ్బి వున్నాయి. జుట్టు చిందరవందరగా వుంది.

నన్ను చూసి తలదించుకుని తిరిగి లోనికి వెళ్ళిపోయింది.

'పాపం ఆమె' అనుకున్నాను.

'ఛీ దుర్మార్గుడు' అని కూడా అనుకున్నాను.

* * * *

ఆమె నా వంక ఓమారు చూసింది. ఎంత పెద్ద కళ్ళో. తలకు పోసుకున్నట్లుంది: ముగ్ధసౌందర్యం ఎర్రపూల అంగం ఆమె ఒంటిని పులుముకున్నదేమో. కానీ ఆ కళ్ళలో ఏదో బెదురు. ఒక్కక్షణం అంటె ఒక్కక్షణం నా కళ్లలోకిచూసింది. ఆ కళ్లల్లో ఏదో నిస్సహాయత. నా గుండె వూగిసలాడింది ఓ క్షణం. మరు క్షణం వెళ్ళిపోయింది ఆమె.

డాబామీదకు చేరాను. వెండి వెన్నెల వల్చగా పడుతున్నది ఎదురింటి అమ్మాయి వాళ్ళమ్మతో ఏదో పెద్దగా ముచ్చట్లు చెబుతున్నది. మాటల మూట.

నేనుండే యింటివెనుక భాగంలో ఓ డాబా వుంది. అటు చూసి కొంది క్షణాలు ఆశ్చర్యంగా వుండిపోయాను. ఆ యింటి కిటికీ తెరిచి వుండటంతో ఓ దృశ్యం నా కంట బడింది. కొత్తగా పెళ్ళయిన జంట. ఆమె నిలబడివున్నది. అతనేమో ఆమెను గట్టిగా హత్తుకుని ఆమె పెదవులను అందుకుంటున్నాడు. ఆ చుంబన దృశ్యం నా కళ్ళకు మనోజ్ఞంగా కనబడింది. వెంటనే తప్పు తెలుసుకుని చటుక్కున డాబామీద కూలబడి పోయాను.

సంధ్యను అలా ఎన్ని వందల సార్లు ముద్దు పెట్టుకున్నానో....సంధ్యా ఎక్కడున్నావ్? ఎలా బ్రతుకుతున్నావ్ నన్నొదిలి. నేను చూడు నీ జ్ఞాపకాలు వచ్చి


నలందా

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐ టి ఐ)

(కాలేజి ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ ఆవరణ)

మోడరన్ కేఫ్ వెనుక, గవర్నర్‌పేట, విజయవాడ—520002

డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్ వారి మెమో నెం డి/35524/79 ప్రకారం ఈ క్రింది ఐ టి.ఐ కోర్సులకు అడ్మిషన్లు లభించును నిర్ణీత దరఖాస్తు ఫారం ధర రు 5 బాలురకు హాస్టల్ వసతి లభించును డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్) కోర్సుకు బాలికలు కూడా అర్హులు

| వ.నెం. | కోర్సు | అర్హత | కోర్సు పరిమితి | సీట్ల సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్) | కాంపోజిట్ మాథమాటిక్స్‌తో పదవ తరగతి ఉత్తీర్ణత | 2 సం॥ | 32 |
| 2. | డ్రాఫ్ట్స్‌మన్ (మెకానికల్) | కాంపోజిట్ మాథమాటిక్స్‌తో పదవ తరగతి ఉత్తీర్ణత | 2 సం॥ | 16 |
| 3 | ఫిట్టర్ | 8వ తరగతి ఉత్తీర్ణత | 2 సం॥ | 16 |
| 4. | వెల్డర్ (గ్యాస్&ఆర్క్) | 8వ తరగతి ఉత్తీర్ణత | 1 సం॥ | 16 |
| 5. | రిఫ్రిజిరేషన్ & ఎయిర్ కండిషనింగ్ | పదవతరగతి ఉత్తీర్ణత | 2 సం॥ | 16 |

"వనితా జ్యోతి" చదవండి!

ఋషి పుంగవులు
యుగయుగాల
తరబడి పరిశోధన





సేవాశ్రమ్ వారి
ఆవ మార్కు

బ్రహ్మి ఉసిరి తలనూనె
మరియు నల్ల పళ్ళ పొడి

బ్రహ్మి ఉసిరి తలనూనె ఆధునిక పద్ధతిలో తయారుచేయబడిన నూనె మాత్రమే కాదు, ఒక ఆయుర్వేద సౌందర్య ప్రసాదిని.
ఇక నల్ల పళ్ళపొడి కేవలం పళ్ళపొడే కాదు. ఒక ఆయుర్వేద ఔషధం.

ఆయుర్వేద సేవాశ్రమ్ లిమిటెడ్ ఉదయపూర్, వారణాసి, హైదరాబాద్



పరీక్షల్లో ఉత్తమంగా నిలిచింది.
నాథ్ పీటర్స్
సైదాబాద్, హైదరాబాద్-500 659

సినిమాతారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రద
ల ఫోటోల సెట్టు 5 రూ. ఏ యన్నార్,
ఎన్టీ ఆర్, శోభన్ బాబు, కృష్ణ, కృష్ణంరాజు
ల ఫోటోల సెట్టు 6 రూ. నాటిగాయకుడు
ఘంటసాల, నేటిగాయకుడు S.P. బాల
సుబ్రహ్మణ్యం ఫోటోల సెట్టు 4 రూ.
సినీతారల అడ్రసుల పుస్తకం 2 రూ.
ఈ క్రింది అడ్రసుకు ఎం.ఓ. చేసిన
వారికి పంపబడును.
వై.కె. మూర్తి
దాసరివారి వీధి, విజయవాడ-2.
SUVARNA

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా
ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాపును.
త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును.
ప్రచార నిమిత్తము ఒక పీసా మందు ఉచితంగా
పంపబడును. పెంటనే వ్రాయండి. వివరాలకు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!

దురభ్యాసములకు లోనై
దాంపత్య సౌఖ్యం పొంద
లేనివారు, హెర్నియా.
చర్మవ్యాధులకు పోస్టు
ద్వారా వరిబీజము (బుడ్డ).
మూత్రవ్యాధులు,
ఇస్నోఫీలియా. దమ్ము,
ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండ రండి.
డా॥ దేవర,
5/1, బ్రాడీపేట, గుంటూరు-2
బ్రాంచీలు: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు-17.
మార్వాడిగుడి వద్ద, తెనాలి. ఫోన్ 551.

నప్పుడు నా పిచ్చి గుండె ఎంత బాధ పడి పోతున్నదో.... నేను గుర్తుకు వచ్చినప్పుడలా నీ కంట కన్నీరు తిరిగితే నా కెంత తృప్తో. నన్ను మర్చిపోవు కదూ.... నీ జ్ఞాపకాలు నన్ను కాలుస్తున్నాయి.... సిగరెట్ వెలిగించాను. ధైర్యంగా వుండటానికి. లేకుంటే ఎక్కిళ్ళు వస్తాయి.

ఆకాశం వంక చూశాను. ఏడుస్తున్నట్టుగా వుంది. క్రిందకు వెళ్ళి నిద్రబోతే బాగుంటుందేమో—నిద్రబోతే హాయిగా కలలు కనవచ్చు. సంధ్యను కలుసుకోవచ్చు. ఎన్నో మధుర స్వప్నాలు కనవచ్చు. ప్చ్. ఇలా కలల్లో దుఃఖాన్ని తరుముతున్నాను. కనబడుతున్నాయి స్ట్రీట్ లైట్ల క్రింద అమ్ముతున్న బండిలోని పూలు. పూలంటే ఎంతపిచ్చో సంధ్యకు. ఆ పొగరు మోతు పువ్వులు నన్ను చూసి నవ్వుతున్నట్లు అనిపించింది.

గదిలోకి వచ్చి నిశ్శబ్దాన్ని భరిస్తూ వుండిపోయాను. సోమరి గాలి కిటికీలో గుండా దూకుతున్నది. చీకటి, నిశ్శబ్దం ఈ మధ్య నన్ను అపరిమితంగా బాధిస్తున్నాయి. బయట రాత్రిచుక్కలు ఇప్పుడు లేవు. వెన్నెల పెరుగుతున్నది. సంధ్య మళ్ళీ గుర్తుకొస్తున్నది. వెన్నెల చూస్తేనే చాలు వెంటనే సంధ్య గుర్తుకొస్తున్నది.

ప్రక్కింటి ఆమె తన ఇంటి ముందున్న ఖాళీస్థలంలో కుర్చీ ఒకటి వేసుకుని కూర్చుంది. కిటికీ గుండా ఆమె నాకు కనబడుతున్నది. నేను ఆమెకు కనబడను. ఆమె ఆకాశంలోని నక్షత్రాలను చూస్తున్నది. వెన్నెల్లాంటి చీరె కట్టింది. వెన్నెట్లో సౌందర్య ప్రోగును కుర్చీలో ఒలకబోసినట్లుగా వుంది. ఆకాశంలోని ఓ చిన్న నక్షత్రం అందుకుని ఆమె ముక్కున పుడకలా వుంచాలన్న ఓ తెలివైన కోరిక నాలో కలిగింది. ఆ రాజారావ్ ఎంత పిచ్చివాడు. ఆమెను చూస్తూ, పూలు తింటూ, వెన్నెలను త్రాగుతూ, హాయిగా బ్రతికెయ్యక ఆమె మీద తను మొగుడు అనే అధికారం ఎందుకు చెలాయిస్తున్నాడో నాకైతే అర్థం కావడం లేదు అయినా నా బొంగ. ఎంపలి చెట్లకు నిచ్చెనలు వేసే మనస్తత్వం వాడిదామె. అందాన్ని ఆరాధించే హృదయం అందరికీ వుంటుందా — ప్చ్.

చటుక్కున కరెంట్ పోయింది. అంతా చీకటి ముద్ద. చీకటి భయంకరంగా వుంటుంది. మనుషుల బుద్ధిలా వుంటుంది. చీకట్లో వుండే బుద్ధి కాలేదు. అంత గట్టి చీకట్లో చేతిలోని సిగరెట్ కొరివి దెయ్యంలా ఎర్రగా కాలుతున్నది.

ఆమె లోనికి వెళ్ళి వచ్చినట్టుంది.

"ఏమండీ"

'నన్నే — నాలో ఆశ్చర్యం.

"ఏమండీ" మరోసారి తియ్యగా పిలిచింది ఆమె.

"అగ్గిపెట్టె వుంటే ఇవ్వరూ దీపం వెలిగించుకుంటాను" ఆ గొంతులో వేడికోలు. చాలా పెద్ద సహాయమేదో అడిగినట్లు అడిగింది.

చేతిలోని అగ్గి పెట్టెను ఆమెకు అందిస్తుంటే ఆమె మెత్తని చేతి వేళ్ళు తగిలి నా ఒళ్ళు ఝల్లుమన్నది.

చప్పున కరెంట్ వచ్చేసింది. నాచేతిలో అగ్గిపెట్టె ఆమె తీసుకోవడం, కరెంట్ రావడం ఒకేసారి జరిగాయి. తలత్రిప్పి చూస్తే రాజారావ్ గేటుదగ్గర నిలబడి మా వంకే చూస్తున్నాడు. 'ఓరి దేముడా. ఈ దుర్మార్గుడు యిప్పుడే రావాలా. వీడు నీచుడే, ఆమెను ఏం చేసాడో!....'

ఆమె తన భర్తనిచూసి అగ్గిపెట్టెను అక్కడే జారవిడిచి కంగారుగానూ భయంతోనూ తూలుతున్నట్లు నడుస్తూ లోనికి వెళ్ళిపోయింది.

రాజారావ్ చూపులతో నన్ను కొద్ది కొద్దిగా మింగుతున్నాడు.

"కరెంట్ పోయింది. అగ్గిపెట్టె కావాలంటే.... చూశారా. నా అగ్గిపెట్టెతో పని లేకుండానే కరెంట్ వచ్చేసింది" నవ్వుతూ అన్నాను కడుపులో ఏడుస్తూ. ఆ వెధవకు సంజాయిషీ చెప్పుకోవలసిన అవసరం నాకు లేదు. ఆమెకోసం అనవలసివచ్చింది. అతను చూస్తుండగానే ఆమె కిందకు వదిలిన అగ్గిపెట్టెను అందుకుని చూపుతూ 'యిది నిజం నమ్మవలసింది' అన్నట్లు సాక్ష్యంగా అగ్గిపెట్టెను చూపాను.

నీచత్వం మూర్తీభవించిన రాజారావ్ మాత్రం 'హు' అని అనేసి భూమిని తన్నుకుంటూ యింట్లోకి వెళ్ళిపోయాడు.

నీరసంగా వచ్చి కుర్చీలో కూలబడ్డాను.

ఇంతలో హఠాత్తుగా రాజారావ్ కేకలు. ఆమె బాధతో కూడిన అరుపులు నాకు వినిపించాయి. జుట్టు పీక్కుంటూ వుండిపోయాను. 'ఒరే రాజారావూ ఒరే ఆడదాన్ని పట్టుకుని కొట్టే వెధవా. నీకు యిదే ఆఖరి జన్మ. ఇక మానవ జన్మఎత్తే హక్కు నీకు లేదు-' కసిగా అనుకున్నాను.

చాలా సేపు పిచ్చివాణ్ణి చేశాయి రాజారావ్ అరుపులు, వాడు కొడుతున్న శబ్దాలు, ఆమె ఏడుపులు.

పాపం అలసిపోయినట్లున్నాడు. రాజారావ్ భూమిని తన్నుకుంటూ బయటకు నడిచాడు. నాగురించే కాబోలు సన్నగా

బూతులు వప్పజెప్పుకుంటూ వెళ్ళిపోయాడు.

కణతలు రుద్దుకుంటూ వుండిపోయాను.

* * *

ఈ రోజు ప్రొద్దున్నే నా గది చిమ్మే పనిమనిషి వెంకమ్మ చెప్పింది. 'ఓరి దౌర్భాగ్యుడా. ఛీ ముండాకొడకా.' అనుకున్నాను. మనసంతా వేదనతో నిండిపోయింది. వాడు మనిషికాదు. పశువు. నరరూప రాక్షసుడు. ఆమెకు మూడవ నెలట. వాడు-ఆ వెధవ రాజారావ్ ఆమె మీద అనుమానంతో ఎవడివల నో నీకు గర్భం కలిగివుంటుంది అని తిట్టి తెల్లవారు ఝామున ఆమెచేత ఏదో మందు త్రాగించేడుట.

శిశు సమాధి జరిగిపోయింది.

పై విషయం వెంకమ్మ చెప్పింది. చెప్పి తిటిపోసింది. వెంకమ్మ ఆ నలుపు రంగు జంతువును తిడుతూవుంటే నాకేదో స్వాంతన చేకూరినట్లయింది. ఇంకా చాలామంది రాజారావ్‌ను తిట్టాలి. రాజారావ్ దుర్మార్గాన్ని అసహ్యంచుకోవాలి.


త్వరలో యిల్లు మారదా మనిపించింది. ఆమెను చూస్తుంటే నా గుండె తరుక్కుపోతున్నది. ఇంకా కొంతకాలం నేనిదే యింటోవుంటే ఏదో ఒక రోజు నేను ఖూనీ చేశానని పోలీసులు నా మీద గట్టి సాక్ష్యంతో జైల్లోకి త్రోయడానికి గట్టి అవకాశం వుందనిపించింది ఇల్లు మారదామనుకున్నాను. సాధ్యమైనంతవరకు రాజారావ్ ఇంటికి చేరుకునే టైమ్‌కు నేను రోడ్లమీద రాళ్ళు తన్నుకుంటూ తిరగ వలసివస్తున్నది. ఎందుకంటే ముందు తను రాగానె అప్పటికేదో చాలా ఆలస్యమై పోయినట్టుగా తన డ్యూటీ చాలా క్రమశిక్షణగా నిర్వహిసున్నట్లు ఆమెను హింసిస్తున్నాడాయె మరి. ఆమె అనుభవించే నరకాన్ని నేను చూడలేను. అందుకే వేరే గది చూసుకునేవరకూ ఇలా తిరగడమే కొంత నయమనిపించింది. వాడు అలసి ఆమెను వదిలివేసే టైమ్‌లో నేను గదికి చేరుకోవడం అలవాటుచేసుకున్నాను.

ఆమెకా కత్తులబోను నుంచి విముక్తి ఎప్పటికో. ఈ ముక్క చాలాసార్లు అనుకుంటున్నాను.

* * *

రాజారావ్ అటు వెళ్ళగానే బజారుకు బయల్దేరుదామనుకుంటుంటె ఆమె వచ్చింది నా గది దగ్గరకు.

నేను సంభ్రమానికి లోనయ్యాను. "రండి" అన్నాను ఆదరంగా.




"మీరు వెళ్ళిపోతున్నారుటకదా" ఆమె తల దించుకుని అన్నది.

"అవును. అనుకోకుండా ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అసలు నేను వేరేగది తీసుకుందామనుకుంటున్నాను. ఈలోగా ట్రాన్స్‌ఫర్ అయింది. రేపు తెల్లవారు ఝామున ఐదింటి బండికి వెళుతున్నాను" ఆమెనే చూస్తూ అన్నాను.

"నన్ను మన్నించండి" నా వంక ఓసారి చూసి తల దించుకుంది.

"దేనికి" ఆశ్చర్యంగా అన్నాను.

"అన్యాయంగా మీరు ఆయన చేత తిట్లు తిని వున్నారు గనుక" ఆమె కళ్లు ఒత్తుకుంది.

"వాడు జంతువు" కోపంగా అన్నాను.

ఆమె నా కళ్ళల్లోకి ఓసారి ఏదో వెదుకుతున్నట్లు చూసింది. ఏమీ మాట్లాడకుండా గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

ఆశ్చర్యంగా ఆమెనే చూస్తూ వుండిపోయాను.

* * *

బస్సు బయల్దేరుతుంటే పరుగెత్తుకుంటూ వచ్చింది ఆమె. చేతిలో సూట్‌కేస్. నేను ఆశ్చర్యంనుంచి కోలుకోక మునుపే నా ప్రక్కన వచ్చి కూర్చుంది.

నా కళ్ళనిండా మధుర స్వప్నాలు. నా జీవితంలో వాలికిపోయిన ప్రేమపాత్ర మళ్ళీ నాకు దొరుకుతున్నదా!

ఆమె చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. బస్సు వేగాన్ని అందుకుంది.

